అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

- రోడ్ల మీదే వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు



టోలిచౌకీ ఫ్లై ఓవర్ కింద రోడ్డుపై అక్రమ పార్కింగ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెహిదీపట్నం, రైతుబజార్, పాత మెరాజ్ హోటల్, నానల్‌నగర్, కాంగ్రెస్ ఫైలాన్, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో షాపులు, రెస్టారెంట్ల ముందు సగం రోడ్డు వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కు చేసి ఉంటున్నాయి. అలాగే షేక్‌పేట్, టోలిచౌకీ ఫ్లై ఓవర్ల కింది భాగంలో రోడ్డు సగం వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు పార్కు చేసి ఉంటున్నాయి. దీంతో ఆ మార్గం గుండా వాహనాలు ముందుకు వెళ్లడం కష్టంగా మారింది. గచ్చిబౌలి నుంచి ఎన్నో వాహనాలు టోలిచౌకీ మీదుగా మెహిదీపట్నం వైపు వెళ్తాయి. అయితే ఆర్టీసీ బస్సులు మాత్రం ఫ్లై ఓవర్ కింద నుంచి టోలిచౌకీ చౌరస్తా మీదుగా మెహిదీపట్నం వెళ్లేవి. ఇక్కడ ఉన్న రుమాన్, రెహమత్ హోటల్స్ ముందు వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు పార్కు చేసి ఉంటున్నాయి. దీంతో బస్సులు గత్యంతరం లేక ఫ్లై ఓవర్ పై నుంచే వెళ్తున్నాయి. దీంతో టోలిచౌకీ చౌరస్తా వద్ద ఉండే ప్రయాణికులు బస్సులు దొరకక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. టోలిచౌకీ, నానల్ నగర్ తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లు నామమాత్రంగా కొనసాగుతున్నాయని పలువురు ఆరోపించారు. ఫుట్‌పాత్‌లపై వెలిసిన కొన్ని డబ్బాలు, స్టాల్స్‌ను మాత్రమే వారు తొలగించారని అక్రమ పార్కింగ్‌ల వైపు కన్నెత్తి చూడలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

శాస్త్రీయ సంగీత కళలను పరిరక్షించుకోవాలి



నృత్య కళాకారులతో వక్తలు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం వృిదావన నాట్యాలయ సంస్థ 2వ వార్షికోత్సవ వేడుకలను శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్తన పేరిట ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రముఖ నృత్య గురువు బాలాజీ మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీత కళలు మన సంపద అని వాటిని పరిరక్షించుకోవాలన్నారు. కూచిపూడి, భరతనాట్యం వంటి కళల పట్ల చిన్నారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు అణన్యరెడ్డి శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శనలు వీక్షకులను మంత్రముగ్దులను చేశాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆల' రాకతో బీజేపీకి కొండంత బలం



ఆల పురుషోత్తమ్‌రావును సన్మానిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి

అబిడ్స్: బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ప్రముఖ సంఘ సేవకుడు ఆల పురుషోత్తమ్ రావు బీజేపీలో చేరడంతో పార్టీకి కొండంత బలం చేకూరిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న ప్రగతి, అభివృద్ధికి ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన గోషామహల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..స్థానికంగా ప్రజల్లో మంచి పట్టు ఉన్న ఆల పురుషోత్తమ్‌రావు బీజేపీలోకి రావడం ఎంతో ఆనందకరమన్నారు. ఆల పురుషోత్తమ్‌రావు మాట్లాడుతూ..ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు భీశ్వ ఓంప్రకాష్, పలువురు నేతలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని బీజేపీ నాయకుడు గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అవినీతిమయమైన పార్టీలను చిత్తుగా ఓడిస్తూ ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ అవినీతి కూపంలో కూరుకుపోయాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అశ్విన్‌మోదీ తదితరులున్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో 'ఎరుడైట్ హర్ స్కాలర్‌షిప్ ఎడిషన్'



కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు

గోల్కొండ: విద్యార్థులు తాము కోరుకున్న సబ్జెక్ట్‌ను పూర్తి చేసేందుకు సరైన స్కాలర్‌షిప్ ఆప్షన్‌ను ఎంచుకోవాలని కళాశాల హెచ్‌అండ్‌ఎం డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎం.అపర్ణ అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జీ.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎరుడైట్ హర్ స్కాలర్‌షిప్ ఎడిషన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత సాధించిన వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కారణంగా తాము చదివే కోర్సును విజయవంతంగా పూర్తి చేయగలుగుతారన్నారు. కళాశాల స్థాయి నుంచి పీజీ, రీసెర్చ్ వరకు కూడా స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.లక్ష్మి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే సమగ్ర కుటుంబ సర్వే



మహేష్‌కుమార్‌గౌడ్‌తో కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: ప్రజా సంక్షేమం కోసమే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సర్వే బూటకం అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషిని సహించలేకే ప్రతిపక్షాలు అర్థరహిత ఆరోపణలు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, రాములు తదితరులున్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్



అబిడ్స్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ శనివారం కలిశారు. కేటీఆర్‌కు గోషామహల్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పదేళ్లలో బీఆర్‌ఎస్ హయాంలోనే కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్రలు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్, రింగ్‌రోడ్డు, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయడం, రోడ్డుపై గుంతలను పూడ్చడం వంటి పనులను అధికారులు సరైన సమయంలో చేయడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాధనాన్ని కేటాయిస్తారని, అయితే పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. తమ తమ ప్రాంతాల్లోని సమస్యలను ఆ ప్రాంత మజ్లిస్ నాయకులు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటికి అవసరమైన నిధులను కేటాయిస్తామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, వజీవుజ్‌జమా తదితరులున్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



మణికొండ: కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఫెడరేషన్ కప్ పోటీలలో కోకాపేటకు చెందిన నలుగురు విద్యార్థులు రాణించి బంగారు పతకాలను సాధించారని కోచ్ రాజు తెలిపారు. పలు విభాగాలలో పోటీ పడిన కె.తనుష్, కె.లౌషిక్, వి.విష్ణు, ఎ.చరణ్‌యాదవ్‌లు బంగారు పతకాలను సాధించారన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని టోర్నమెంట్‌లలో మరింత మంది రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని కోచ్ పేర్కొన్నా రు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

అలరించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి



గన్‌ఫౌండ్రీ: చంద్రిక మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. యువ గాయకుడు వి.స్కంద తొలి ప్రదర్శనలోనే అద్భుతమైన గాత్ర కచేరితో ప్రేక్షకుల మనసులను దోచుకున్నాడు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిస్టర్స్ లలిత, హరిప్రియ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే చిన్నారులకు శాస్త్రీయ సంగీత గాత్ర కచేరిల పట్ల మక్కువ కల్పించాలని సూచించారు. 10వ తరగతి చదువుతున్న స్కంద రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు ఎల్లా వెంకటేశ్వర్ రావు, హెచ్‌సీయూ వీసీ ఆచార్య బి.జగదీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన వ్యూహంతో బీజేపీ విజయం



పంకజ్ కుమార్

చార్మినార్: సమర్థ వ్యూహంతో పాటు కార్యకర్తల కృషి వల్లే బీజేపీ ఈ ఎన్నికల్లో విజయం సాధించిందని అశోక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో చేసిన పొరపాట్లను పునరావృతం చేయకుండా మిత్రపక్షాలు, ఇతర సంస్థలతో పాటు కార్యకర్తలు సమర్థవంతమైన వ్యూహం, కృషి వల్లే మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిందన్నారు. ఈ విజయం కోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఎన్నికలలో బీజేపీకి బహిరంగంగా సహాయం చేసిందన్నారు. ఈ విజయానికి దేశ ప్రజలందరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు.

రుద్రారం అంజయ్యకు సేవా రత్న పురస్కారం



చార్మినార్: ఉప్పుగూడకు చెందిన రుద్రారం అంజయ్య ముదిరాజ్ సేవా రత్న పురస్కారం–2024కు ఎంపికైనట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్మెంట్ అండ్ గంగా రిజువనేషన్ నేషనల్ వాటర్ డెవలప్మెంట్ ఏజెన్సీలో డ్రాఫ్స్ మెన్ గ్రేడ్–3గా పని చేసి పదవీ విరమణ పొందిన ఆయనకు ఈ సేవా రత్న అవార్డును అందజేస్తున్నామన్నారు. ఈనెల 26న బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ అయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బి.బాలకృష్ణారెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ, జస్టిస్ ప్రకాష్‌రావు, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తదితరుల చేతుల మీదుగా అవార్డు అందజేయనున్నామన్నారు.

వృద్ధుడి అదృశ్యం



బాలకృష్ణ

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం..సుల్తాన్ షాహీ ప్రాంతానికి చెందిన బాలకృష్ణ (73) మద్యం సేవించే అలవాటు ఉంది. ఈనెల 19న ఉదయం 10:30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన బాలకృష్ణ తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తన తండ్రి కనిపించడం లేదని గోవింద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ సంబరాలు



సంబరాలు చేస్తున్న గోపాల్‌జీ, గోవింద్‌రాఠి తదితరులు



దారుషిఫాలో మిఠాయిలు పంచి పెడుతున్న బీజేపీ నాయకులు

అఫ్జల్‌గంజ్: ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధితోనే మహారాష్ట్రలో బీజేపీ విజయ ఢంకా మోగించిందని బీజేపీ రాష్ట్ర కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ పేర్కొన్నారు. శనివారం అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీదే విజయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు గోవింద్‌రాఠి, దాసరి శేఖర్, ప్రాచి జైన్, ఆనంద్ పాల్గొన్నారు.

పాతబస్తీలో..

చార్మినార్: మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించడంపై పాతబస్తీలో బీజేపీ నాయకులు శనివారం సాయంత్రం మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకొన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో దారుషిఫా హజాఖానా జహరా వద్ద మిఠాయిలు పంచిపెట్టారు. మహారాష్ట్రతో పాటు ఝార్ఖండ్ ఉత్తరప్రదేశ్‌లలో కూడా బీజేపీ అభ్యర్థులను గెలిపించిన స్థానిక ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఫిర్యాదు అందిన గంటలోపే ల్యాప్‌టాప్ రికవరీ



ల్యాప్‌టాప్ బ్యాగును బాధితుడికి అందజేస్తున్న పోలీసులు

గోల్కొండ: ఫిర్యాదు అందిన గంటలోపే ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని రికవరీ చేశారు గోల్కొండ పోలీసులు. గోల్కొండ డీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ల్యాప్‌టాప్, ఇతర వస్తువులు ఉన్న తన బ్యాగు పోయిందని ఓ వ్యక్తి గోల్కొండ పోలీసులను ఆశ్రయించారు. కాగా ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు అడిగిన పోలీసులు అతడు సూచించిన ప్రదేశంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా పక్కన ఓ వ్యక్తి బ్యాగుతో నిలబడి ఉండడం పోలీసులు సీసీ ఫుటేజీలో గమనించారు. బాధితుడికి ఆ ఫుటేజీని చూపించగా ఆ బ్యాగు తనదే అన్నారు. వెంటనే పోలీసులు సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్దకు చేరుకొని ఆ వ్యక్తి వద్ద నుంచి బ్యాగును స్వాధీనం చేసుకొని ఫిర్యాదుదారుడికి అప్పగించారు.

సన్మానం



గోల్కొండ: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అలుపెరుగని నాయకుడని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దేవర శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా శనివారం ఈటల రాజేందర్ ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ప్రభు పూజారి తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

విజయనగర్‌కాలనీ: వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శనివారం సాయంత్రం మల్లేపల్లి ప్రభుత్వ మైనార్టీ పోస్టు మెట్రిక్ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని పరిసరాలను విద్యార్థులకు అందుతున్న వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలకు ఎటువంటి ఆరోగ్యకర సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ టి.రవి, హాస్టల్ వార్డెన్ అంకుష్ పాషా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియజేద్దాం



శిశుమందిర్ పాఠశాలలో మొక్కలను నాటుతున్న ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తదితరులు

లంగర్‌హౌస్: దేవతా వృక్షాల ఆవశ్యకతను భావితరాలకు తెలిసే కార్యక్రమాలు నిర్వహిద్దామని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. లంగర్‌హౌస్ శిశుమందిర్ పాఠశాలలో సత్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దేవతా వృక్షాలు, పంచ మహావృక్షాలను శనివారం నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ మాట్లాడుతూ..పంచమహావృక్షాలు, దేవతా వృక్షాలైన రావి, మర్రి, జువ్వి, మేడి, మారేడు వృక్షాల ప్రాముఖ్యత నేటి తరానికి తెలవకుండా పోతుందన్నారు. పొగడ, దేవకాంచనం, జమ్మి, మామిడి, టెంపుల్ ట్రీ, కదంబం, వేప, కాడమల్లె, పొన్న, అశోక చెట్టు, అర్జున చెట్టు జీవరాశికి ఆరోగ్యాన్ని ఇస్తూ పూజలు అందుకుంటున్నాయన్నారు. అలాగే సాంప్రదాయ పువ్వులు అయిన గన్నేరు, పారిజాతం, నందివర్ధనం, గోవర్ధనం, మందారం, ప్లమేరియా పూడిక, శివగన్నేరు, సీతా అశోక పూల మొక్కలను ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాలు, పార్కులలో పెంచి కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రసేనారెడ్డి, నాగేంద్రప్రకాష్‌రెడ్డి, పాండుకుమార్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పూజల్లో సంతోష్‌గుప్తా

అబిడ్స్: అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. గోషామహల్ గ్యాస్‌బాగ్ కాలనీలో అయ్యప్పస్వామి భక్తి గీతాలు, భజనలతో అయ్యప్ప భక్తులు మహా పడిపూజ చేపట్టారు. ఈ వేడుకల్లో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌గుప్తా పాల్గొని పూజలు చేశారు.

వైభవంగా కాలాష్టమి పూజలు



నాంపల్లి: బజార్‌ఘాట్‌లోని కాలభైరవ ఆలయంలో కాలాష్టమి పూజలు వైభవోపేతంగా జరిగాయి. కార్తీక మాసంలోని కృష్ణ పక్షంలో వచ్చే అష్టమి తిథి రోజున కాల భైరవ జయంతిని ఇక్కడ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో శనివారం కాల భైరవ జయంతి రావడం మరింత విశిష్టతను సంచరించుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. బజార్ ఘాట్ నుంచి లక్డీకాపూల్ వైపు వెళ్లే వాహనాలను శాంతినగర్ మీదుగా మళ్లించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నాంపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ జాగ్రత్తలు తీసుకున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిత్యానందరావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దక్కన్ సాహిత్య సభ, మానేరు రచయితల సంఘంల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత వెల్దండి శ్రీధర్ రచించిన 'కథా కచ్చీరు'పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వెల్దండ నిత్యానంద రావు మాట్లాడుతూ.. సమాజంలోని పలు అంశాలను రచయిత కథల రూపంలో చక్కగా వివరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు ఆచార్య కె.లావణ్య, విశ్రాంత ఆచార్యులు బండ సరోజన తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: షౌకాత్ జంగ్ దేవిడి బస్తీలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన జలమండలి అధికారులతో కలిసి పైప్‌లైన్ పనులు పరిశీలించి పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్‌తో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... షౌకాత్ జంగ్ దేవిడి బస్తీల్లో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యలు తలెత్తున్నాయన్నారు. నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అంధ విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ



యాకుత్‌పురా: విద్యార్థులు చదువుతో అన్ని రంగాల్లో రాణించాలని సగౌర చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ అన్నారు. సగౌర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం దారుషిఫా ప్రభుత్వ అంధుల పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు, పేదలకు చేయూతనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనిఫామ్స్ దాత డాక్టర్ ప్రదీప్ కుమార్, సభ్యులు డాక్టర్ సూర్య ప్రకాష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖుద్సియా, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్‌చంచలం డివిజన్‌లోని తలాబ్‌కట్టా, చాచాగ్యారేజ్, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగం, పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..డివిజన్ పర్యటన సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను ప్రజలు వివరించారన్నారు. నూతన సీసీ రోడ్డు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులతో పరిశీంచామని ఆయన తెలిపారు.

పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: వాయనాడ్ లోక్‌సభ ఎంపీగా ప్రియాంక గాంధీ గెలవడంతో ఆమె చిత్రపటానికి రాష్ట్ర ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. శనివారం గాంధీభవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..ప్రియాంక గాంధీ గెలుపుతో కార్యకర్తల్లో మరింత మనోధైర్యం పెరిగిందన్నారు. రాబోయేది కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీహెచ్. హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉమెన్ సెలెక్షన్స్

గౌలిపురా: హైదరాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఎల్‌బీ స్టేడియంలోని కబడ్డీ మైదానంలో 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉమెన్ సెలెక్షన్‌లను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింగ్ రావు శనివారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 25వ తేదీలో రిపోర్ట్ చేయాలన్నారు.